# అద్వైతం

దిలావర్

అటు చివరా ఇటు చివరా యిటుకలు లోనికి కూరుకుపోయి మధ్యన అరుగులా మిగిలిన ఎత్తయిన శిథిల స్థలం మీద కాలుమీద కాలేసుకొని కూచున్నాడు శరత్‌బాబు. అతని చేతిలోని బెత్తం స్థిమితం లేని అతని మనసులాగే అటు యిటూ వూగిపోతున్నది.

అడవిలా పెరిగిన జుట్టు. గుబురుగా అల్లుకున్న గడ్డం. లోతుగా... ఎక్కడో లోయలో నిప్పుకణికల్లా ఎర్రగా మండుతున్న కళ్లు. ఆకులు రాలిపోయి ఎండిన మోడులా మిగిలిన బక్కపలచని శరీరం. జనారణ్యం నుండి తప్పిపోయిన వింత జంతువులా వున్నాడు అతను.

"ఎక్కడైనా కొత్త ట్యూషన్లు చూసుకోండి మాస్టారూ...!" అన్న వసంత మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయి శరత్‌బాబుకు.

ఆ ఒక్క బోడి ట్యూషను లేకపోతే తనిక బ్రతకలేనట్టు తనకింక ఎక్కడా గత్యంతరం లేనట్టు ఈ ప్రపంచమంతా గొడ్డుపోయినట్టు ఆమె మాటల్లో ఎంత అహంకారం! ఎంత గర్వం! ఎంత మిడిసిపాటు!

ఏ హోదా... ఏ దర్పమూ... ఏ అహంకారమూ...ఏ అభిజాత్యమూ ప్రదర్శించని వాళ్లు.. బుద్ధిమంతులు...తన పాఠాలంటే పడి చచ్చేవాళ్లు... ఎంతమంది...ఎలా..ఆసక్తితో...చెవులు రిక్కించుకొని యిప్పుడు తనముందు వున్నారో వసంతగానీ చూస్తే గుండె ఆగి, శర్‌మని చచ్చివూరుకొనేది. అలా అనుకున్నప్పుడు అతని హృదయం గర్వంతో వుప్పొంగి పోయింది. ఉత్సాహం వురకలు వేసింది.

ఓసారి కంఠం సవరించుకొని పాఠం చెప్పడం మొదలెట్టాడు.

"అనగా అనగా ఓ బాటసారి. తలవంచుకొని తన దారిన తాను పోతున్నాడు. ఇంతలో 'రక్షించండి... రక్షించండి' అన్న ఆర్తనాదం వినిపించి తలెత్తి చూశాడు. చుట్టూ వాల్కలు చాచుకొని భయంకరంగా వున్నాయి మంటలు! మంటల్లో చిక్కుకొని సహాయం కోసం హృదయ విదారకంగా ఎలుగెత్తి అరుస్తున్నది ఓ ప్రాణి.

మంటల్లో చిక్కుకున్నది ఎవరని గాని, ఆ ప్రాణి స్వభావం ఏమిటనిగాని, ఆ ప్రాణిని రక్షిస్తే తన బతుకు త్రాసులోని లాభ నష్టాల తక్కెడల్లో ఏది మొగ్గు చూపుతుందని గాని ఏమాత్రం ఆలోచించకుండా గబుక్కున తన చేతి కర్రకు తగిలించిన సంచి సహాయంతో మంటల్లోంచి ప్రాణిని రక్షించాడు బాటసారి.." పాఠం చెబుతున్న అతనికి ఎవరో కిసుక్కున నవ్వివట్లనిపించింది.

"బోర్...ఆ పాత కథ తప్ప మీకింకేమీరావా?" అని వెక్కిరించి నట్టున్నాయి ఆ నవ్వులు.

"అబ్బా...! మధ్యలో అడ్డుతగలకండి పూర్తిగా విన్నాక అప్పుడు చెబుదురుగానీ ఎలా వుందో...ఏం?" అన్నాడు శరత్‌బాబు బుజ్జగిస్తున్నట్టు.

అయినా ఆ నవ్వులు ఆగిపోలేదు. జీవంలేనట్టు గలగలమని వినిపిస్తూనే వున్నాయి. సన్నగా ఈలలు కూడా మొదలయ్యాయి. వికృతంగా గుడ్లగూబలు కూస్తున్నట్టు — నక్కలు ఊళ వేస్తున్నట్టు దుర్భరమైన వేదనతో ఎవరో చిన్నగా రోదిస్తున్నట్టు ఏవేవో వింత శబ్దాలు...

ఇంతసేపూ ఎంతో సహనంగా పాఠం చెబుతున్న అతను యిక ఆ అల్లరి భరించలేక పోయాడు.

శక్తినంతా కూడగట్టుకొని "సైలెన్స్" అని బిగ్గరగా అరిచాడు.

అతని వికృత రూపం చూచి, భయంకరమైన అరుపువిని ప్రకృతి కూడా జడుసుకొని స్తంభించి పోయినట్లుంది....

* * *

అతని మనసు గత జీవితపు జ్ఞాపకాల ద్వారం తెరచింది నెమ్మదిగా ....

తన జీవితంలోకి సుడిగాలిలా ప్రవేశించిన వసంత ఒక విచిత్రమైన వ్యక్తి! ఒక వెలుతురు మరక! ఒక చీకటి నీడ!

అనంతంగా ప్రవహించే నిమిషాలూ గంటలూ రోజులూ మనిషి జీవన స్రవంతి ఆగిపోలేదనడానికి బాహ్య చిహ్నాలు. కానీ ఏదో ఒక విలక్షణమైన క్షణం మాత్రం ఆ ప్రవాహంలో కేంద్ర బిందువై దాటిపోలేని సుడిగుండమవుతంది. ఆమెను మొదటి సారి చూచిన క్షణం, తన జీవితంలో అలాంటి విలక్షణమైన క్షణమే అయింది....

ఆమె ముఖంలో విషాద మేఘాలు కమ్ముకొని వున్నాయి. కళ్లు ఏ క్షణంలోనైనా వర్షించేందుకు సిద్ధంగా వున్నాయి.

"మాస్టారూ! నేను ట్యూషను ఎందుకు చెప్పించుకుంటున్నానో మీకు తెలుసా!" అంది హీన స్వరంతో.

వెర్రిమొహం వేశాడు తను. ఎవరైనా ట్యూషను ఎందుకు చెప్పించుకుంటారు? అని ప్రశ్నించుకున్నాడు తను.

"అందంగా అలంకరించుకొని, పైకి హాయిగా నవ్వుతున్నట్టు మీ ముందు కనిపిస్తున్న వసంతలో మీకు తెలియని ఓ శోకమూర్తి వుందంటే మీకు ఆశ్చర్యం కలగవచ్చు... అందరు కన్నెపిల్లల్లాగే నేనూ కలలుగనే వయసులో వున్నప్పుడు ఆ కలలను వాస్తవం చేసుకునే ప్రయత్నంలో ఎంత ఘోరంగా ఓడిపోయానో తలుచుకుంటే నా గుండెలు యిప్పటికీ బద్దలవుతూనే వుంటాయి. ప్రేమించి పెళ్లిచేసుకున్నవాడే ప్రాణానికి ప్రాణం అనుకున్నవాడే తన సుఖాలను మరో అమ్మాయిలో వెతుక్కోవడాన్ని చూడటం కన్నా ఏ ఆడదానికైనా వేరే శాపం ఏముంటుంది? రగులుతున్న అగ్నిపర్వతాలను నా గుండెల్లో ఎన్నో రోజులు దాచుకోలేక పోయాను. ఓ రోజు నా మాటల్లో ఆ పర్వతాలు పేలనే పేలాయి. 'నేను మగవాణ్ణి నాయిష్టం' అన్న జవాబు నాలోని లావాను మరీ రెచ్చగొట్టింది. 'ఇకముందు అలా జరగడానికి వీల్లేదు' అని బుసకొట్టాను. 'నోర్ముయ్ నా దారికి అడ్డం వస్తే వరికి పోగులు పెడతా' అన్నాడు.

నాలోని అహం దెబ్బతిన్నది. నా మనసు ఎదురు తిరిగింది. ఆడదానిమెళ్లో మూడుముళ్లు వెయ్యడమంటే పశువుమెళ్లో పలుపు కట్టడం అని భావించే మగవాళ్లంటే నా కసహ్యం. భార్య అంటే బానిసకాదు. భర్త జీవితంలో భాగస్వామిని. ఆమెకూ ఒక శరీరం వుందని ఆ శరీరంలో ఓ మనసు వుంటుందని గుర్తించని వాడు మనిషికాడు. అడవి మనిషి! మగవాడి అహంకారం ముందు అభిమానం చంపుకొని కట్టు బానిసగా పడివుండే అగత్యం ఏ స్త్రీకి పట్టకూడదు. మీ పాదాల దగ్గర ఓ దాసీగా పడి వుండనీయండి అనే ఆడదానికంటే నా దృష్టిలో శవం నయం...

అప్పటికే నా యిష్టా యిష్టాలతో ప్రమేయం లేకుండానే మాకు ఓ బాబు పుట్టాడు. వాడిని అడ్డం పెట్టుకుని నా కాళ్లకు బంధం వేయాలనుకున్నాడు. కానీ నరక సదృశమైన అతడి సాన్నిధ్యం నుండి అన్ని బంధనాలనూ తెంపుకొని బయటపడ్డాను..." ఆమె కళ్లనుండి కన్నీరు కాల్వలు కట్టి చెక్కిళ్లమీదుగా ప్రవహిస్తున్నది.

వింటున్న తన హృదయం ఏదో చెప్పలేని నిర్వేదంతో బరువెక్కిపోయింది.

ఆమె కన్నీటిని తన చేత్తో తుడిచి ఓదార్చాలని ఆమె తలను తన గుండెలకు గాఢంగా హత్తుకొని లాలించాలని అనిపించింది. కానీ ఏమీ చేయలేకపోయాడు తను.

తన కళ్లు కూడా అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. ఏ రెండు మనసులకు కలసి ఆర్ద్రం అయ్యే అదృష్టం లేదో అవి ప్రేమలోని తియ్యదనం ఎలా తెలుసుకుంటాయనిపించింది తనకు. తన ఆలోచనా ధోరణికి త్రుళ్లిపడ్డాడు.

"ప్రస్తుతం బాబు అతడి దగ్గరేవున్నాడు. సవతి తల్లి తల్లిని మరపింప జేస్తుందంటారా? బాబు పెద్దవాడయిన

**తన గుండె నెత్తురు తో ఆమె కాళ్లకు పారాణి రాస్తానన్నాడు. తన కలలను కన్నీటిగా మార్చి ఆమె పాదాలను అభిషేకించాడు. తన వూపిరిని పూజా కుసుమాలుగా మార్చి ఆమె పాదాలను అర్చించాడు.**



తర్వాత నన్ను అసహ్యించుకుంటాడంటారా? తిరస్కరిస్తాడంటారా?'' అమాయకంగా బేలగా అడుగుతున్న ఆ ప్రశ్నలు ఆమె మాతృ హృదయాన్ని చీల్చుకొని వచ్చాయి.

ఆ ప్రశ్నలు విని కలవరపడ్డాడు తను. ''నో... నెవ్వర్... సవతి తల్లి ఎన్నటికీ కన్నతల్లి కాలేదు... మీరలాంటి భయాలు పెట్టుకోకండి...'' అన్నాడు అంతకన్నా ఆమెను ఎలా ఓదార్చాలో తెలియక.

''సంఘం భార్యను విడిచి పెట్టిన భర్తను సహిస్తుంది. కానీ భర్తతో లేని భార్యను మాత్రం ఏ మాత్రం సహించదు. అప్పట్నుంచీ నా అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి. నేనెవరితోనూ మాట్లాడకూడదు. ఎవరింటికీ వెళ్లకూడదు. ఎలాంటి సరదాలయినా నా దరిదాపులకే రావడానికి వీల్లేదు. ఏకాంతంలో చీకటిలో మగ్గి వూపిరి సలపక అల్లల్లాడిపోతున్నాను. కనిపించని భయంకరమైన మంటలు నా చుట్టూ నాల్కలు చాచుకొని వున్నాయి. అవి ఏ క్షణాన్నైనా నన్ను దహించేందుకు సిద్ధంగా వున్నాయి. ఈ మంటలమధ్య వేరే ప్రపంచంతో సంబంధంలేకుండా మరికొన్నాళ్లుంటే నాకు పిచ్చెక్కేట్టుంది. అందుకే అతి ప్రయత్నం మీద ప్రయివేటుగా పరీక్షక్కడతానని మా వాళ్లను ఒప్పించాను. కనీసం రోజుకో గంటసేపయినా నా మనసులోని బాధ మీతో చెప్పుకొని నా గుండెల్లోని భారం దింపుకొని కొంత మనశ్శాంతిని చేకూర్చుకోవాలని ఆశించి ఈ ట్యూషను కుదుర్చుకున్నాను. అయితే ఈ మంటల నుండి నన్ను

రక్షించే ప్రయత్నంలో మీ చేతులూ కాలకపోవు. అందుకు అద్వాన్సుగా క్షమార్పణ చెప్పుకుంటున్నాను...''అన్నది వసంత దీనంగా తనవైపు చూస్తూ.

ఈ సంఘం ఎప్పుడు ఎవరిని అపవాదులనే ఆ భయంకరమైన మంటలకు ఆహుతి చేయకుండా మినహాయించింది గనక అనుకున్నాడు తను.

''నా గురించి మీరేమీ వర్రీ అవకండి...ఈ విషయంలో నా పూర్తి సహకారం మీకుంటుంది.'' అని ఆ నాటికి ట్యూషన్ ముగించి లేచాడు...

''మీరింతకు ముందెప్పుడయినా ట్యూషన్లు చెప్పారా మాస్టారూ?'' తూనీగ రెక్కల్లాంటి నల్లని కనురెప్పలను తమాషాగా రెపరెప లాడిస్తూ అడిగింది వసంత.

''ఊహూ...ట్యూషన్లు చెప్పడమంటే నాకెందుకో ఎలర్జీ. ఇంతవరకెప్పుడూ ఎవరికీ చెప్పలేదు.''' అన్నాడు తను.

''మరి నాకు చెప్పడానికి ఎందుకు ఒప్పుకున్నారు?''

ఎదురు చూడని ఆ ప్రశ్నకు కంగారుపడ్డాడు తాను. ఏం చెప్పాలో తోచలేదు. మాటలు వెతుక్కోవలసి వచ్చింది.

''ఏదో... మీనాన్నగారు... మరీమరీ అడిగితే... కాదనలేకపోయాను...''

''నిజం చెప్పండి. అంతేనా లేక...నన్ను చూసి...'' సూటిగా నావేపు చూస్తూ అడిగింది వసంత. ఆ చూపులు తన కళ్లలోకి కాక గుండెల్లోకి చూస్తున్నట్లున్నాయి. గుండెల్ని తూట్లు పొడుస్తున్నట్లున్నాయి. మనిషిని నిలువునా చీలుస్తున్నట్లున్నాయి.

ఆమె మాటలకు తన గుండెల్లో కోటివీణలు స్పందించినట్లనిపించింది.

ఓ బిడ్డ తల్లైనా ఎంత అందంగా వుంది వసంత! అసలీమె సౌందర్యం చూసి కాలం కూడా ముందుకుసాగడం మరచిపోయినట్టుంది.

'నిజం చెప్పాలంటే మీ అందం చూసే ఈ ట్యూషన్ ఒప్పుకున్నాను' అందామనిపించింది తనకు. కాని అనలేకపోయాడు.

''మీ కెలా అనిపిస్తే అలాగే అనుకోండి''....అన్నాడు.

వసంత కిలకిలా నవ్వింది ఆ సమాధానం విని. ఆమె నవ్వగా చూడటం అదే మొదటిసారి. ఆమె సోగ కళ్లలో యింతవరకు శ్రావణ మేఘాలనే చూశాడు తను. కానీ శరశ్చంద్రికలు కూడా ఎంత అందంగా వెల్లివిరుస్తాయి ఆ కళ్లలో!

ఎంత అందంగా వుంది ఆ నవ్వు! ఎదుటివాడి సర్వశక్తుల్నీ తనలోకి పీల్చుకోగల నవ్వు! వరదలా ముంచుకొస్తున్న ఆమె నవ్వులో తన సర్వేంద్రియాలూ కొట్టుకుపోతున్నట్టనిపించింది.

ద్వివిధ భావాల విచిత్ర సమ్మేళనం వసంత అనుకున్నాడు....

''పాఠాలు చెప్పకు పోతున్నారు కానీ... ఫీజు మాట ఎత్తటం లేదు మాస్టారు...'' కొంటెగా కవ్వింపుగా చూస్తూ అన్నది ఓసారి.

''ఫీజా...? ఏమిస్తావేమిటి?'' అర్థయుక్తంగా అన్నాడు తను.

''మీరడగాలేగానీ.. ఏదయినా యిస్తాను'' అంది కళ్లలో కళ్లు కలిపి.

బ్రతికినంత కాలం నిరర్ధకంగానే దొర్లిపోతాయి ఎన్నో వాక్ప్రవాహాలు! కానీ... ఒక్కోసారి నోటివెంట వెలువడ్డ ఒక్క మాటకే ఎంత శక్తివుంటుందో తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ ఒక్కమాట మృత్యులోకాల్లో మనిషిని కూడా లాక్కొచ్చి ప్రాణం పోస్తుంది.

ఆ ఒక్కమాటతో తన ఎదలోయల్లో నిద్రాణంగా వున్న ప్రేమ పాతాళ గంగలా పెల్లుబికింది. ఇలాంటి ఒక్క ఆనందపు బొట్టు దొరికితే చాలు మిగిలిన జీవితమంతా విచార సముద్రమయినా ఈదుకురావచ్చు అనుకున్నాడు.

అందమైన వస్తువులను చూసినా అందమైన మాటలను విన్నా జన్మ జన్మల స్మృతులేవో తనలో కలకవేసేవి. ఏదో అశాంతి, ఏదో తపన, ఏదో వేదన, ఏదో ఆరాటం తనను తొలుచుకు తినేవి. తనలో ఆరని మంటలై రగిలేవి.

నరనరాల్లో వుద్రేకం పొంగులు వారుతుంటే తనను తాను నిగ్రహించుకోలేక తనలో రగులుతున్న జ్వాలలను వసంత అధరామృతంతో చల్లార్చుకున్నాడు.

''ఇదే....నే నాశించే ఫీజు...''అన్నాడు చిలిపిగా.

''ఛీ! పొండి'' అంటూ పెదవులు సుతారంగా తుడుచుకుంది వసంత.

ఆమె బుగ్గల్లోకి ఎర్రగా రక్తం చిమ్మింది.

ఆమెలేని తానుగానీ తానులేని ఆమెగానీ లేదనుకున్నాడు. అదొక అనుభూతి కందని గొప్ప అద్వైత స్థితి... ఆ భావన తన ఎదలోపలి ఎదలో ఏ సున్నిత తంత్రులనో నాజూగ్గా మీటింది. ప్రేమతో బాటే కవిత్వం కూడా వెల్లువలా పెల్లుబికింది.



తబలా

తలకు మాలిష్ చేసుకుంటున్నాడు మాణిక్యం.

''నువ్వు మాలిష్ చేయటం నేర్చుకోకమునుపు ఏం చేసేవాడివి?'' అడిగాడు మాణిక్యం.

''తబలా వాయించేవాడిని బాబయ్యా!'' చెప్పాడు మాలిషతను.

బి.వి.యస్.బాబు (తెనాలి)

ఆమె కళ్లు రస సముద్రాలని రాశాడు. ఆ సముద్రాలు సృష్టించే చూపుల తుఫానుల్లో ఏ సౌందర్యలోకాలకు కొట్టుకుపోతున్నాడో తనకే తెలియదు. ఆమె పెదవులు వీణలని వర్ణించాడు. ఆ వీణలు సృష్టించిన నవ్వుల రాగాలలో తాను ఏ అనురాగతీరాలకు తేలిపోతున్నాడో ఆ స్పృహే లేదు. తన గుండె నెత్తురులతో ఆమె కాళ్లకు పారాణి రాస్తానన్నాడు. తన కలలను కన్నీటిగా మార్చి ఆమె పాదాలను అభిషేకించాడు. తన వూపిరిని పూజా కుసుమాలుగా మార్చి ఆమె పాదాలను అర్చించాడు. కలవరించాడు... పిచ్చిగా పలవరించాడు... ఉప్పొంగే తనలోని భావోద్రేకాలకు అక్షర రూపం యిచ్చి, కాగితాలను గుట్టలు గుట్టలుగా పేర్చుకు పోతున్నాడు...

కాలం రెక్కలు కట్టుకుని హుషారుగా ఎగిరిపోతున్నది.

ఆ మత్తులో... ఆ మైకంలో... తన్నుతాను సదా స్పృహలో వుంచుకుంటూ తన ప్రేమ వాహినిలో తలమున్కలవుతున్న పిచ్చివాడ్ని చూస్తూ స్త్రీగా గర్వించిందే తప్ప హద్దు మీరి ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేదు వసంత.

''పరీక్షలు కానీయండి. తర్వాత చూద్దాం'' అనేది తెలిగ్గా.


ఆ పరీక్షా ఫలితాలు కూడా వచ్చేశాయి.

కాని తన ప్రేమ పరీక్ష యింకా విషమ పరీక్షగానే మిగిలిపోయింది.

స్త్రీని ప్రకృతితో ఎవరు పోల్చారో కాని వారి అనుభవానికి జోహార్లు చెప్పవలసిందే.

ఆకర్షణ...! ఆకర్షణ ఒక్కటే ఆ ప్రకృతి ధర్మం! అందుకు ఎన్ని ఋతువులు, ఎన్ని రంగులు, ఎన్ని మబ్బులు, ఎన్ని మెరుపులు, సప్తవర్ణాలను విరజిమ్మే ఎన్ని ఇంద్రధనుస్సుల రూపాలెత్తవలసి వచ్చినా ఆనందంగా ఎత్తుతుంది!

ఆమెలో ఏమీలేదని సమాధానపడబోయి కొత్త అందాలను అన్వేషిస్తూ ఆమె నుండి పారిపోబోయి ఒక్క అంగుళం కూడా కదలలేక పతికిలబడుతూ జీవ న్మరణాల మధ్య స్వర్గ నరకాల మధ్య వెలుగు నీడల మధ్య అనురక్తి విరక్తుల మధ్య జారికోపం మధ్య





చిత్రం

'మన చిత్రం ప్రతివూర్లో రోజుకి ఆరుషోలు వేస్తున్నారటగా?' అడిగాడు దర్శకుడు.

"అవును! సెన్సారు పోగా మిగిలింది మూడు రీళ్లేగా!" అన్నాడు నిర్మాత.

సిరిసిల్లా రశీద్ శిక్షక్ (జంగంపల్లి)

నరిగిపోతూ వస్తూ బతుకుతూ వస్తూ ఆమె బిగిస్తున్న వుచ్చుల మధ్య వూపిరాడక గిలగిల తన్నుకుంటూ

"అంత తొందర పడితే ఎట్లా...? ముందు నాకో వుద్యోగం సంపాదించి పెట్టండి. నా కాళ్ళమీద నేను నిలబడే స్వతంత్రం వచ్చాక... మీ మాటకు కట్టుబడి వుంటాను..." అన్నది వసంత.

ఉరుములూ మెరుపులూ లేకుండానే పిడుగులు పడ్డట్టు వున్నాయి ఈ ఆమె మాటలు.

"నిన్ను పెళ్ళి చేసుకోవడం నా కిష్టంలేదు". అని ఒక్కమాటలో చెప్పొచ్చుకదా! ఈ డొంక తిరుగుడంతా ఎందుకు?

తనకే వుద్యోగం దొరికే మార్గం కనబడ్డంలేదు. ఎంచేతంటే ఆస్తిపాస్తులు లేకపోయినా ఉద్యోగం లేకపోయినా ఉపవాసాలు చేస్తున్నా దర్జాగా కులం పేరు చెప్పుకుంటే చాలు కడుపు దానంతట అదే నిండిపోతుంది అని ముద్రపడిన లిస్టులోని వాడతను! ఇక ఆమె కెక్కడ్నించి వుద్యోగం తెస్తాడు? అంతకంటే... ఏ కొండ శిఖరం అంచుమీంచో అగాధంలోకి దూకమంటే వెనకాముందూ ఏమాత్రం ఆలోచించకుండా కళ్ళు మూసుకొని అమాంతం దూకేసేవాడు.

ఆమెలో కరడుగట్టిన చీకటిని కరిగించడానికి తన గుండె వత్తిని చేసి మండించాడు. ఆమెలోని శిలను శిల్పంగా మార్చేందుకు తనలోని సున్నితమైన భావాలనూ, తాను నేర్చుకున్న లలిత కళలనూ, తన సర్వశక్తులనూ ధారపోశాడు.

కాని ఆమె రాతి గుండె కరగనే లేదు.

చివరకు నిరాశే... నిస్పృహే... అశాంతే మిగిలింది!

ఆమెకు తన జీవితాన్ని నిత్యవసంతం చేసుకోగల నేర్పువుంది. అందుకు 'శరత్తు'లా చల్లగా సాగిపోయే యితరుల జీవితాల్లో ఎన్ని గ్రీష్మాలు అలుముకున్నా ఆమె లెక్కచేయదు.

ఆమెకు భర్తనుండి విడాకులిప్పించడానికి తన పలుకుబడిని వుపయోగించిన పెద్దమనిషే ఇప్పుడు జిల్లా సెలక్టు కమిటీలో మెంబరట! అతడే ఆమెకో దారి చూపించాడు. ఆమెను తన దారిలోకి తెచ్చుకున్నాడు. ఆమెకు ఉద్యోగం కావాలి. అతనికి ఆమె కావాలి. ఇద్దరికీ రెండూ అమిరాయి.

స్కూటర్ మీద ఠీవిగా అతను! అతనివెనక విలాసంగా వసంత!

ఈ దృశ్యం చూసేందుకేనా ఆమె అమృతం పేరుతో విషాన్నిచ్చినా తాను నవ్వుతూ తాగింది...!

వారి ముందు చేష్టలుడిగి శిలాప్రతిమలా సిగ్గుతో జుగుప్సతో ఓటమితో విరక్తితో ఆవేదనతో తలవంచుకొని తను!

"పూర్ ఫెలో..." స్కూటర్ వాలా నవ్వుతున్నాడు.

నవ్వుల పాలైన తన బతుకును సరిగ్గానే అంచనాకట్టాడు అతను. తను యిన్నాళ్ళుగా నిర్మించుకున్న ప్రేమ సామ్రాజ్యం తన కళ్ళముందే శిధిలమై దగ్ధమై బూడిదయిపోతుంటే తన మనసు వ మౌనంగా ఆక్రోశించింది.

తన గుండెలో ఏ సముద్రాలు పోటెత్తుతున్నాయో... ఏ ఉప్పెనలు వుప్పొంగుతున్నాయో... ఏ అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయో... పగులుతున్న తన గుండె చప్పుళ్ళు వసంత వినగలిగితే...

గుండెలోతుల్లోంచి వుబికిన వెచ్చని కన్నీరు తన కళ్ళనుండి ధారగా ప్రవహిస్తున్నది.

"ఎక్కడైనా కొత్తట్యూషన్లు చూసుకోండి మాస్టారూ" అని ఎంత ఎగతాళిగా నవ్వింది వసంత! శిలలు నవ్వుతున్నట్టుంది ఆ నవ్వు.

ఆమె మాటల్లో ఎంత హేళన! ఎంత అహంకారం! ఎంత మిడిసిపాటు...

తన కోరికలను, ఆశలను, కలలను, వెలుగును, సర్వస్వాన్నీ దోచుకొని— చూస్తుండగా కనుమరుగై పోయింది స్కూటర్.

ప్రేమ మనిషిలో లలితమైన సున్నితమైన భావాలను తట్టిలేపుతుందని అనుకున్నాడు. గుండెపొరల్లో పేరుకున్న క్రూరత్వాన్ని కల్మషాన్ని కరిగించి అట్టడుగున నిదురిస్తున్న మానవతా భావాలకు వూపిరి పోస్తుందని భావించాడు. ఎదవీణ పలికించిన సుధారసగీతం యింత విషాదంగా— యింత రాక్షసంగా మారుతుందని వూహించలేక పోయాడు...

* * *

ఇంతసేపు తాను కూర్చున్న శిధిల సమాధి మీది నుండి లేచి కంఠం సవరించుకొని మళ్ళీ పాఠం చెప్పడం మొదలెట్టాడు శరత్‌బాబు.

"సారీ ఫ్రెండ్స్...! ఇంతసేపు స్వగతంలో పడిపోయి పాఠం ఆపేశాను. ఎంతవరకొచ్చింది మనకథ...? ఆ... ఆ... ఎస్... ఆ ప్రాణిని మంటల్లోంచి రక్షించాడు బాటసారి... కదా? అప్పుడేమయిందంటే... మంటల్లోంచి బయటపడటమే తరువాయి ఆ ప్రాణి తన స్వాభావిక ప్రవృత్తిని ప్రదర్శిస్తూ బుసకొట్టి పడగవిప్పింది.

ఆ సమయంలో అక్కడికి ఒక నక్క— మామూలు నక్క కాదు— గుంటనక్క— జిత్తుల మారి నక్క వచ్చింది. వింటున్నారా...? పూర్వం అయితే నక్కల్లో కూడా నిజాయితీ మానవత్వం వుండేవట! ఇప్పుడు మనుషులే తోడేళ్ళూ నక్కలూ అయిపోతున్నారనుకోండి. మరి ఇప్పుడొచ్చిందేమో పూర్తిగా ఈ కాలపు జిత్తులమారి గుంటనక్క. వచ్చి, ఏమిటీ సంగతి? అన్నట్టు చూసింది. ఇద్దరూ జరిగిన సంగతి వివరించారు.


'నేన్నమ్మను. ఇంత చిన్న ఖాళీ సంచిలో... అంత పెద్ద అంతస్తులోవున్న ఈ ప్రాణి ఇమిడిందంటే.. నమ్మనుగాక నమ్మను' అన్నది నక్క.

బాటసారి అప్రయత్నంగా తన గుండె తడుముకున్నాడు. అది ఖాళీగా బోలుగా చాలా చిన్నగా వున్నట్టనిపించింది. నక్క చెబుతున్నది నిజమేనేమో అనుకున్నాడు.

"నువ్వు ట్యూషనుచెప్పి ఇప్పించిన డిగ్రీ అనే వూతక్రా ఖాళీ సంచిలాంటి నీ హృదయం చూసి మైమరచి ఆ మంటల్లోంచి ఎగిరి వచ్చిందని భ్రమ పడుతున్నావా? పిచ్చివాడా? ఇటుచూడు..." అని తన చేతిలోని బ్రీఫ్‌కేస్ తెరచి చూపించింది నక్క. బ్రీఫ్‌కేస్‌నిండా నోట్లకట్టలు నిండివున్నాయి!/

'ఈ నోట్లతోనే ఆ మంటల నోరు మూయించాను. ఇక ఇంతటితో నువ్వుకూడా నోరు మూసుకుని పడివుండు' అని చెప్పి క్రూరంగా త్రాచుపాములా, అందంగా వున్న ఆ ప్రాణిని తన స్కూటర్‌మీద ఎగరేసుకుపోయింది. గుంటనక్క... అదీకథ..." అన్నాడు విషాదంగా నిట్టూరుస్తూ అతని కళ్ళలో అకస్మాత్తుగా నీటిపొర కమ్మింది.

ఆకాశం శూన్యంగా బావురుమంటున్నది. చీకటి దట్టంగా అలుముకున్నది. చిటచిటపటలాడుతూ మండుతున్నాయి చితులు. నిర్లిప్తంగా ఉన్నాయి



సమాధులు. గోతుల్లోంచి బయటపడిన అస్థులు చితిమంటల వెలుగులో తెల్లగా కనిపిస్తున్నాయి. అస్థులనిండా సాలెగూళ్ళు అల్లుకుని వున్నాయి. దుర్భరమైన వేదనతో ఏడుస్తున్న స్త్రీ గొంతును తలపింపచేస్తున్నది ఈదురుగాలి. ఈదురుగాలికి అటూ యిటూ చెదిరిపోతున్నది చితాభస్మం....

ఇంతసేపూ అతని పాఠం వింటున్న శ్మశానంలో ఏదో అలజడి... ఏదో చైతన్యం...

"మవ్వెరివైనా ప్రేమించావా బాబూ?" జాలిగా అడిగింది ఓ చితిమంట.

సమాధికూడా అదే ప్రశ్నవేసింది సానుభూతిగా..

"ప్రేమంటే ఏమిటో తెలియకుండానే ప్రేమించావాబాబూ?" లాలిస్తూ అన్నది బూడిద.

"నిజమేనా?" అన్నట్టు చూసింది చీకటి.

"ఎంతపని జరిగింది నాయనా!" అన్నది ఆప్యాయంగా తల నిమురుతూ శూన్యం.

అంటే...???

చితిమంటకు, సమాధికి, బూడిదకు, చీకటికి, శూన్యానికి ప్రేమ అనేది స్వానుభవం లోనిదేనన్నమాట! తనే ఉత్త అమాయకుడు. ఏమీ తెలియని వెర్రిబాగులవాడు అనుకున్నాడు శరత్‌బాబు.

ఇన్నాళ్ళుగా అతని మనసు పొరలను కమ్మిన చీకటి తెరలు తొలగిపోయినట్లయింది.

ఏదో కొత్త తేజస్సుతో అతడి మొహం వెలిగిపోతున్నది. ఏదో వెర్రి ఆనందం అతడ్ని ఆవహించింది.

ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతం అయింది. చిరుజల్లు ప్రారంభమైంది. వానలో తడుస్తున్నానన్న స్పృహకూడా లేదు అతనికి.

ముందుకు వంగి ఓ కపాలాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఆ కపాలం కళ్ళగుంటలనుండి బొట్లుబొట్లుగా నీళ్ళు జారిపడుతున్నాయి.

"ఏమిటి..? నా కథ వింటే నీక్కూడా దుఃఖం వస్తున్నదా నేస్తం...?" అన్నాడు ఆశ్చర్యంగా.

తన కోసం కన్నీరు నింపుకోగల ఆప్తులు ఇంకా ఈ ప్రపంచంలో వున్నారన్న భావం అతడ్ని వివశుడ్ని చేస్తున్నది.

"మరి.. మరి... అందరూ అలా అనుకుంటారేమిటి..? మీకు మనసు వుండదని — అంతఃకరణ వుండదని — ప్రేమ ఉండదని — నిజానికి మీరే... మీరే... ప్రేమమూర్తులు!!! తన ప్రేయసికోసం ఇటుక ఇటుకలో ఊపిరులునింపి సజీవసమాధి అయిన సలీములున్నారు మీలో! తన హృదయాన్నే భిక్షాపాత్రగా చేసుకొని ప్రేయసి ముందు దీనంగా చేతులుచాచి ప్రేమను యాచించిన మజ్నూలున్నారు మీలో! తన గుండె నెత్తురులతో రక్తతర్పణంచేసిన లకుమాదేవులున్నారు మీలో! తన దైవంలో కలిసేందుకు హాలాహలాన్ని సైతం అమృతప్రాయంగా ఆరగించిన మీరాబాయిలున్నాయి మీలో! తన ప్రేయసి ఒక్క ఓరచూపు కోసం తమ బ్రతుకుల్నే కావ్యాలుగా మలుచుకున్న సరసులున్నారు మీలో...

కాని... అటు చూడండి... ఆ జనవాసంకేసి.... నిజానికది జనవాసం కాదు. ప్రేతభూమి! అక్కడున్నవన్నీ క్షణం క్షణం ఛస్తూ బతికే జీవచ్ఛవాలే! వాళ్ళ హృదయాల్లో ప్రేమ కాలి కమురువాసన కొడుతున్నది.

కదిలే ఆ సమాధుల్లో మమతానురాగాలు ఖననం చేయబడ్డాయి. ఐశ్వర్యాలకు శరీరాలు అమ్ముడుపోగా మిగిలిన అస్థిపంజరాలు వాళ్ళు. ఆత్మలను — అంతఃకరణలను చంపుకొని వలపంతా బూడిదకాగా శూన్యంగా మిగిలిన నడపీనుగులు వాళ్ళు....

ఆ కుళ్ళు... ఆ దుర్గంధం.. భరించలేక అక్కడ్నుంచి పారిపోయి వచ్చాను. మీకో విషయం చెప్పనా..? ఇన్నాళ్ళూ మీరెక్కడున్నారో తెలియక పిచ్చిగా లోకమంతా గాలించాను. ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది.. నిజానికి మీరున్నది నాలోనేనని! అసలు మీరూ నేనూ ఒకటేనని! ప్రేమ తత్వాన్ని తెలిపిన ఓ ప్రేమ స్వరూపుల్లారా...! మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను.. రండి...! ఓ ప్రేమమూర్తుల్లారా...! రండి..! నన్ను మీలో ఐక్యంచేసుకోండి... మీలో కలుపుకోండి..." అంటూ ఉద్విగ్నంగా... ఉద్రేకంగా.. నరాలు తెగిపడేట్టు.. పిచ్చిగా.. ఎలుగెత్తి.. అరచి అరచి సొమ్మసిల్లి పడిపోయాడు శరత్‌బాబు.